క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

భామిని: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల అధ్యక్షుడిగా భామినికి చెందిన అనిల్‌కుమార్ సాంత్రోను నియమించారు. ఈ మేరకు ఆ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంపత్‌కుమార్ నుంచి నియామక పత్రం పొందినట్టు సాంత్రో మంగళవారం తెలిపారు. ప్రజల హక్కుల సాధన కోసం పాటుపడతానని తెలిపారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న ఎస్.ఐ కళాధర్, ప్రత్యేక బృందం

వీరఘట్టం: నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎస్.ఐ జి.కళాధర్ అన్నారు. ఇటీవల కాలంలో మహిళల మెడలో బంగారు గొలుసులు దొంగిలించిన ప్రాంతాల్లో మంగళవారం డ్రోన్ కెమెరాలతో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వీరఘట్టం మేజరు పంచాయతీలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సారా విక్రయాలను కూడా ఈ డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. రద్దీ ప్రాంతాల్లో కూడా డ్రోన్‌తో నిఘా వేశారు.

నాణ్యత లేని పనులకు బిల్లులు చెల్లించొద్దు

జియ్యమ్మవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీవో ఎస్.రమేష్ మంగళవారం సమావేశమయ్యారు. ఉపాధి పనుల్లో భాగంగా చేపడుతున్న ఫారంపాండ్‌లు, ప్రహరీ, క్యాటిల్ షెడ్స్, సోప్‌కిట్స్, చెరువు పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని పనులకు బిల్లులు చెల్లించవద్దని, వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయించాలన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం



పీసా చట్టం గూర్చి చెబుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: పీసా చట్టంపై అవగాహన అవసరమని, ప్రతిఒక్కరూ ఆ చట్టం గూర్చి సంపూర్ణంగా తెలుసుకోవాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు, పీసా కమిటీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పీసా చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని, చట్టం పక్కాగా అమలయ్యేలా చూడాలని ఎంపీడీవో తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో పదో తరగతి, ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులతో పాటు భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా తరగతుల విద్యార్థులకు కింది తరగతుల విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

జియ్యమ్మవలసరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం మండలంలోని ధర్మలక్ష్మీపురానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా, కురుపాం వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావును ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు చినమేరంగిలో మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులను మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్నకు రుణపడి ఉంటామని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారి కోసం ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి వారిని కోరారు. సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు స్పందన

స్థానిక వైటీసీలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 35 మందిని ఎంపిక చేశారు. నెల్లూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని స్కిల్ కళాశాల కోఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు.

\- సీతంపేట



భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు

భామినిలో వెలసిన శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా పవిత్ర చక్రతీర్థ స్నానాలను భక్తులు మంగళవారం ఆచరించారు. ఆలయం నుంచి నూతనంగా నిర్మించిన పల్లకిలో శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్టించి తిరువీధి నిర్వహించారు. అనంతరం వంశధార నదిలో దేవతా విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేసి వేలాది మంది భక్తులు స్నానాలు గావించారు. ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

\- భామిని



మూతబడిన మద్యం దుకాణాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసి వేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పాలకొండ సర్కిల్ పరిధిలోని మద్యం షాపులు, బార్‌లను మూసి వేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలు ముగుస్తాయని తరువాత మద్యం షాపులు తెరుస్తామన్నారు.

\- వీరఘట్టం

శివపూజకు వేళాయె

- మంగళవారం అర్ధరాత్రి నుంచి రుద్రాభిషేకాలు
- శివ పూజకు సిద్ధమవుతున్న శైవ క్షేత్రాలు
- మహా శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

వీరఘట్టం:

మహాశివరాత్రి ఎంతో పవిత్ర పర్వదినం.. అందుకే ఈ రోజున శైవ క్షేత్రాల్లో హరనామం జపించడం ఎంతో పుణ్యప్రదం. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఆ ఆదిదేవుని దర్శించుకునేందుకు శివాలయాల్లో భక్తుల కోసం నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు వీరఘట్టంలోని ఉమాసోమేశ్వరస్వామి దేవాలయం, ఉమాచంద్రమౌళీశ్వర ఆలయాలు, కుంబిడి ఇచ్చాపురంలోని కుంబేశ్వరస్వామి ఆలయం, నడుకూరులోని కాశీవిశ్వేశ్వరుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని కంబర, తలవరం, నడిమికెల్ల, బిటివాడ, అడారు, విక్రమపురం, కిమ్మి తదితర గ్రామాల్లో వెలసిన శైవక్షేత్రాలు అన్ని హంగులతో ముస్తాబయ్యాయి. లయకారుడైన పరమశివుడు జ్యోతిర్లింగ స్వరూపుడు అందుకే స్థానిక బ్రహ్మకుమారీలు మంచుతో కూడి ఉన్న శివ లింగాలను ఏర్పాటు చేశారు. వీటిని ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక స్టాల్స్‌ను నిర్మించారు.

వందేళ్లుగా దశుమంతపురంలో..

మండలంలోని దశుమంతపురం గ్రామంలో వందేళ్లుగా శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి తూర్పున ఒట్టిగెడ్డ సమీపంలో కొలువు దీరిన శ్రీశ్రీశ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది కూడా మహా శివరాత్రి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మూడు రోజులు యాత్ర జరుగుతుంది. రాత్రికి వివిద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



మిన్నాజోల క్షేత్రంలోని త్రివేణి సంఘంలో మీనకేశ్వరుడుకు పూజలు చేస్తున్న భక్తులు

> **సృష్టి లయకారుడు**
>
> సృష్టిలయకారుడైన ఆ పరమశివునికి మహాశివ రాత్రి పర్వదినం ఎంతో ప్రీతికరమైన రోజు. మహాశివరాత్రి పర్వదినంలో శైవక్షేత్రాలను సందర్శిస్తే వేయి జన్మల పుణ్యఫలం ఉంటుందని మన పూర్వీకుల నమ్మకం. అందుచే భక్తులు నియమనిష్టలతో ఆ నీలకంఠునికి పూజలు చేస్తే ఎంతో పుణ్య ఫలం లభిస్తుంది. – ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజి, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం

సర్వం సిద్ధం

భామిని: వంశధార నదీ జన్మస్థలంగా పిలవబడుతున్న ఒడిశాలోని మిన్నాజోల క్షేత్రంలో వెలసిన మీనకేశ్వరుని ఆలయానికి మహా శివరాత్రి ముందు రోజు మంగళవారం రాత్రి నుంచే భక్తులు తరలివెళ్తున్నారు. భామిని మండలం బత్తిలి నుండి 60 కిలోమీటర్ల దూరంలో గల ఒడిశా గుడారి సమీపం చంద్రపూర్ అటవీ ప్రాంతం వంశధార నదీ తీరంలో క్షేత్రం వెలసింది. మహా శివరాత్రికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకొని మిన్నాజోల క్షేత్రంలో లభించిన మీనాలు(చేపలు)ప్రసాదంగా స్వీకరించి తరలి వస్తారు.



నడుకూరులో వెలసిన కాశీవిశ్వేశ్వరుడు



రుద్రాభిషేకాలకు సిద్ధమైన కుంబిడిలో వెలసిన కుంబేశ్వరస్వామి

తప్పుడు సమాచారం ఇవ్వొద్దు..

పాలకొండ రూరల్: మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులు సంబంధిత ధ్రువపత్రాల కోసం నమోదు చేసుకున్న వారు పూర్తి వివరాలు అందించాలని ఎంపీడీఓ వీవీ రంగారావు స్పష్టం చేశారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ పరిధిలో మరణ ధ్రువపత్రాలు కోరిన అర్జీదారుల ఇళ్లకు వెళ్లి వాకబ్ చేశారు. అనంతరం అక్కడ సచివాలయాన్ని సందర్శించారు. వేసవి నేపథ్యంలో సచివాలయం పరిధిలోని తాగునీటి వనరులను అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు.



వెలగవాడలో మరణ ధ్రువపత్రం కోరిన వారితో చర్చిస్తున్న ఎంపీడీఓ

మార్చి 31లోగా నిర్మాణాలు పూర్తి చేయాలి

జియ్యమ్మవలసరూరల్: కొత్తగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా నిర్మాణాలను మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేయాలని ఏఈ ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని కొండచిలగాం పంచాయతీలో పలువురికి మంజూరైన ఇళ్ల కొలతలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారులంతా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్‌ను సంబంధిత సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా గృహనిర్మాణ శాఖ అధికారులకు అందజేయాలని కోరారు. మండలంలో ఇప్పటికే 2163 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటికే నిర్మాణాలు చేస్తున్న వారికి దశల వారీగా బిల్లులు చెల్లిస్తున్నామన్నారు.



ఇంటి కొలతలు తీస్తున్న సిబ్బంది

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

పాలకొండ రూరల్: మండలంలోని మల్లమ్మగూడ గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మాన్ యోజన గృహాలకు సంబంధించి పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. సదరు గిరిజన గ్రామంలో 12మంది లబ్ధిదారులు ఈ పథకానికి అర్హత పొందినట్లు హౌసింగ్ ఏఈ బి.మాధవరావు తెలిపారు. అయితే ఈ ప్రాంతం రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉంది. ఇదే విషయాన్ని ఐటీడీఏ పీఓ, పాలకొండ సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డికి హౌసింగ్ అధికారులు నివేదించారు. దీంతో స్పందించిన అధికారి ఐటీడీఏ సర్వేయర్ విజయ్‌కుమార్‌తో క్షేత్ర పరిశీలన చేపట్టి సమగ్ర సమాచారాన్ని అందించాలని సూచించారు. సర్వే జరిపిన అధికారులు తమ నివేదికను పీఓ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



మల్లమ్మగూడలో అర్హుల సమక్షంలో సర్వే చేపడుతున్న హౌసింగ్, ఐటీడీఏ అధికారులు

ముగిసిన శిక్షణా తరగతులు

గుమ్మలక్ష్మీపురం: జ్ఞానజ్యోతి కార్యక్రమం పేరిట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంఈవో బి.చంద్రశేఖర్, భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న బోధనా మెలకువలను పాటించి, చిన్నారుల విద్యా ప్రగతికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీదేవి, రేవతి, ఈశ్వరమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో అప్పలనాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి జ్ఞానజ్యోతి పేరిట ఇప్పుడు ఇచ్చిన శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె.కొండలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎత్తు కొలవడంపై శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

గిట్టుబాటు ధర కల్పించండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజనులు సేకరించే కంది, పసుపు పంటలతో పాటు చింతపండు, కొండచీపుళ్లు, జీడిపిక్కలను జీసీసీ లేదా ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జీసీసీ పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం కారణంగా దళారులకు తక్కువ ధరకే అటవీ ఉత్పత్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తద్వారా గిరిజనులు ఎంతగానో నష్టపోతున్నారన్నారు.

శిక్షణతో బహుళ ప్రయోజనాలు



శిక్షణ పొందిన అంగన్‌వాడీలతో ఎంఈఓ, ఐసీడీఎస్ అధికారులు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ కె.సోంబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన పిల్లల పట్ల అంకిత భావంతో నిర్వాహకులు మెలగాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను మెరుగ్గా కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం 82మంది అంగన్‌వాడీలకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందించారు. సీడీపీఓ బి.సిమాలమ్మ, సూపర్‌వైజర్లు దశారత్నం, టి.మేరి తదితరులు పాల్గొన్నారు.

భామినిలో..

భామిని: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో అక్షర జ్ఞానం పెంచి చదువుపై ఆసక్తి పెంచాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిభవాని, కేజీబీవీ ప్రిన్సిపాల్ భాగ్యవతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్ అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ఎస్ఓలు జ్యోతిలక్ష్మి, సబితాపట్నాయక్, డీఆర్‌పీలు గోవిందరావు, అప్పారావు, క్రాంతిపాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పాలకొండ రూరల్: వసతిగృహ విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం వైద్యాధికారి రవికుమార్ అన్నారు. మండలంలోని బడ్డుమాసింగి ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులపై పరీక్ష నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

నీటి కుంటల తవ్వకాలపై ప్రత్యేక దృష్టి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులు నీటి కుంటల తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి కుంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో డ్వామా ఏపీఓ శ్రీనివాసరావు, ఏపీఓ జి.సత్యంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారికి ఇరువైపులా ఇటీవల నిర్మించిన మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువల్లో చెత్తలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సుమారు ఎనిమిది నెలలుగా ప్రధాన రహదారిలో ఉన్న కాలువల్లో మురుగు తొలగించకపోవడంతో సాయంత్రం అయ్యే సరికి దోమలు విజృంభిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ నెల 13న సాక్షిలో ప్రచురితమైన 'అస్తవ్యస్తంగా కాలువలు' కథనంపై అధికారులు స్పందించారు. ఇటీవల ఈ కథనంపై డీఎల్‌పీఓ రమాప్రసాదరావు, ఎంపీడీఓ బి.వెంకటరమణ పంచాయతీ ఈఓ రవిని వివరణ కోరారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. దీంతో మంగళవారం వీరఘట్టం ప్రధాన రహదారిలో ఈఓ ఎం.రవి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. జేసీబీతో కాలువలపై ఉన్న సిమెంట్ పలకలు తొలగించి భారీగా పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. మరో నాలుగు రోజుల పాటు ఈ పనులు ఉంటాయని రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులు సహకరించాలని ఈఓ కోరారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరమణ పనులను పర్యవేక్షించారు.



ఈ నెల 13న సాక్షిలో వచ్చిన కథనం



వీరఘట్టం ప్రధాన రహదారిలో జేసీబీతో తొలగిస్తున్న చెత్తలు

పోలింగ్ కేంద్రం పరిశీలన

వీరఘట్టం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో 120 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉందని తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మంనాయుడు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రక్తదానానికి ముందుకు రావాలి

పాలకొండ: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదానం శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రక్తనిల్వల అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రెడ్‌క్రాస్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఈ శిబిరంలో రక్తనిల్వలను సేకరించారు. విద్యార్థులు, అధ్యాపకులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది కలసి 126 మంది రక్తదానం చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శివ్వాల మన్మథరావు, ఏడీ మాణిక్యాలరావు, శ్రీనివాస్, సీఐ చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సత్యనారాయణ, పింకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు అభినందనలు తెలుపుతున్న సబ్ కలెక్టర్

ఉపాధి పనుల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని పెద్దూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పంచాయతీల వారీగా ఫారంపాండ్‌ల నిర్మాణాల లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ మేరకు నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా సిబ్బందిని ఆదేశించడం జరిగిందన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ పాల్గొన్నారు.



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి



పోలింగ్ కేంద్రంలోని వసతులు పరిశీలిస్తున్న తహసీల్దారు శివన్నారాయణ

మౌలిక వసతులు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి, మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు) వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు శివన్నారాయణ మంగళవారం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి : డీడీ

సీతంపేట: విద్యార్థినులకు మెనూ పకడ్బందీగా అమలు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీ కృష్ణవేణి సూచించారు. స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పెడుతున్న భోజనాలను పరిశీలించారు. ఆర్ఓ వాటర్‌ప్లాంట్, స్నానపు గదులు, మరుగుదొడ్లు చూశారు. పాఠశాల పరిసరాలు కలియ తిరిగారు. సూపర్‌స్పెషాలిటీ నిర్మాణంతో ఆ పక్కన ఉన్న ప్రహరీగోడ పడిపోవడంతో నిర్మాణానికి అధికారులకు ప్రతిపాదిస్తామన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, రికార్డులు చూశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున ఎలా ప్రిపేర్ కావాలనేది సూచనలు, సలహాలు ఇచ్చారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. శతశాతం ఫలితాలు సాధించేలా సాధన చేయించాలన్నారు. హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినుల మెనూ పరిశీలిస్తున్న డీడీ కృష్ణవేణి